# సొంత ఇంటి కలను ఎండమావిగా మార్చిన వైఎస్సార్సీ



## - 90శాతం పూర్తిచేసిన టిడ్కో ఇళ్లను పట్టించుకోని ప్రభుత్వం
## - స్థలాల కొనుగోలులోను స్కాములే: ఎమ్మెల్యే రవికుమార్

**అద్దంకి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త** నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం పేదలకు టిడ్కో గృహాలను అందజేసేందుకు 90శాతం పనులను పూర్తి చేసిందని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సోమవారం సింగరకొండ సమీపంలో నిర్మాణంలో వున్న టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 90శాతం టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని అయితే వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే 10శాతం నిర్మాణ పనులను పూర్తి చేయలేక గత నాలుగు ఏళ్లగా పట్టించుకునే నాధుడు లేక, ఆ గృహాలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన అన్నారు. 90శాతం పూర్తి చేసిన ఇళ్లను పేదలకు అప్పగిస్తే చంద్రబాబు ఎక్కడ మంచి పేరు వస్తుందో అని దుర్బుద్ధితో ఆ ఇళ్ల నిర్మాణాలను ఈ ప్రభుత్వం పట్టించుకో లేదని అన్నారు. పనులు చేయకుండా నిర్మాణాల కోసం 7వేల కోట్లను అప్పుగా తెచ్చారని, వాటిని పూర్తి చేయక పోగా తిరిగి మరో 4వేల కోట్ల అప్పు కోసం ప్రయత్నంచడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం ప్రభుత్వం 3,13,832 లక్షల గృహాల సముదాయాల నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. వీటిని పూర్తి చేసి పేదలకు అప్పగించడంలో జగన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వీటిని వదిలివేసి కొత్తగా జగనన్న కాలనీల పేరుతో భూముల కొనుగోలు కూడ స్కాం లకు తెరతీసారని రవికుమార్ విమర్శించారు. 83కోట్ల రూపాయాలతో గుండ్లనది నుండి అద్దంకి ప్రజల దాహార్తి తీర్చేందుకు గత ప్రభుత్వంలో మంచినీటి శాశ్వత పధకాన్ని మంజూరు చేయించానని అయితే పథకంలో టిడో ్క ఇళ్లకూడ పైపు లైను నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం కూడ ఈ పథకంలో చేర్పించానన్నారు. అయితే టిడ్కో ఇళ్ల వద్దకు పైపు లైన్ నిర్మాణం గాని, ట్యాంకు నిర్మాణం గాని చేయకపోగా దానిని రద్దు చేసారని ఎమ్మెల్యే రవికుమార్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. నాలుగు ఏళ్లగా ఈ ప్రభుత్వం శిలాఫలకాలను వేసుకోవడం, రంగులు మార్చడం తప్పా చేసిన అభివృద్ధి శూన్యమని ఆయన అన్నారు. 7వేల కోట్ల రూపాయాల అప్పు తెచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లలో పిఎంఎవై ఇళ్ళు కేవలం ఐదు మాత్రమే నిరి ్మంచారని, గత ఆగష్టులో పార్లమెంటు సాక్షిగా ఆ శాఖ మంత్రి ప్రకటించిన విషయాన్ని రవికుమార్ ఈ సందర్భంగా గుర్తు చేసారు. గత తెలుగుదేశం ప్రభుత్వం 4600కోట్లు ఖర్చుచేసి 3లక్షల 20వేల ఇళ్లు నిర్మించడం జరిగిందని ఆయన వెల్లడించారు. టిడ్కో ఇళ్ల విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు ఉచితంగా ఇళ్లను అందజేస్తుందని గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం పనికి రాని భూములకు నాలుగైదు రెట్లు అధిక రేట్లను చెల్లించి కొనుగోలు చేసిందని ఆ సొమ్మును వైకాపా నాయకులు మూటల రూపంలో వెనకేసుకున్నారని ఆయన విమర్శించారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో ఇటు గ్రామీణ, అటు పట్టణంలో గృహ నిర్మాణాల వ్యవస్థను అస్థవ్యస్థ చేసి, పేదవాడి స్వంత ఇంటికలను సమిధలుగా మార్చిందని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. గృహ నిర్మాణాల విషయంలో రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్దంగా వున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఆయన వెంట అద్దంకి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు సమీర్ ఖాన్, అద్దంకి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు వున్నారు. రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమంలో భాగంగా సింగరకొండలో అసం పూర్తి నిర్మాణంలో వున్న టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు.

# హిందూమతానికి దిశానిర్దేశకులు ఆదిశంకరాచార్యులు
## - నేడు జగద్గురువు ఆదిశంకరాచార్యుల జయంతి

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** సమకాలీన హిందూమతం ఆలోచనా సరళిపై అత్యంత ప్రభావం చూపిన వ్యక్తి ఆదిశంకరాచార్యులు. కన్యాకుమారి నుంచి కాశ్మీరు వరకు నాలుగుసార్లు పాదయాత్ర చేసి 72మతాలను ఒక్కటిగా చేసిన ఘనత కూడా ఆదిశంకరునికే దక్కింది. అందుకే ఆయన్ను జగద్గురువుగా పిలుస్తారు. కీ.పూ. 2వేల సంవత్సరంలో కర్మభూమి, ధర్మభూమి, పుణ్యభూమిగా పిలవబడుతున్న భరతఖండంలో కులమతాల చిచ్చులు, నాస్తికత్వం పునాదులు కదులుతున్న వేళ, అజ్ఞానం, నరమేధం జరుగుతున్న సమయంలో కేరళలోని కాలడి గ్రామంలో ఆదిశంకరాచార్యులు జన్మించారు. హిందూమతాన్ని ఉద్ధరించిన త్రిమతాచార్యుల్లో ప్రధములు. గురువు, మహాకవి ఈయనే. దుష్టాచార వినాశాయ ప్రాతుర్భూతో మహాతలే స ఏవ శంకరాచార్య సాక్షాత్ కైవల్య నాయక. దుష్టాచారాలను నశింపచేయడానికి కైవల్యనాయకుడైన శంకరుడే ఆదిశంకరుని రూపంలో అవతరించాడని ప్రతీతి. కృష్ణ యజుర్వేదశాఖకు చెందిన నంబూద్రి బ్రాహ్మణ దంపతులైన ఆర్యమాంబ, శివగురువులకు కేళలోని పూర్ణానది ఒడ్డున ఉన్న కాలడిలో శంకరులు జన్మించారు. శంకరాచార్యులు తండ్రి చిన్నతనంలోనే మృతిచెందడంతో ఆర్యమాంబ కొడుకు పోషణ బాధ్యతలు స్వీకరించి



శాస్త్రోక్తంగా ఉపనయనం జరిపించింది. శంకరులు ఏకసంధాగ్రాహి. బాల్యంలోనే వేదవిద్యలు, సంస్కృతం అభ్యసించారు. బాలబ్రహ్మాచారిగా శంకరులు ఒకరోజు బిక్షాటన చేస్తూ పేదరాలి ఇంటికి వెళ్ళి బిక్ష అడుగగా భిక్ష వేసేందుకు ఏమి లేక తన ఉపవాసాన్ని విరమించడం కోసం ఉంచుకున్న ఉసిరికాయను దానం చేసింది. దానికి చలించిన శంకరులు కనకధారాస్త్రోత్రాన్ని చెప్పారు. దీంతో పులకించిన లక్ష్మిదేవి బంగారు ఉసిరికాయలు వర్షింపచేస్తుంది. సన్యాసం తీసుకునే సమయం ఆసన్నమవడంతో శంకరులు తల్లి అనుమతిని కోరుతారు. శంకరులు సన్యసిస్తే తాను ఒంటరిని అవుతానని చెప్పడంతో ఆమె అంగీకరించదు. ఒకరోజు శంకరులు పూరానదిలో సాన్నంచేస్తుండగా ఒక మొసలిపట్టుకుంది. సన్యాసం తీసుకోవడానికి అంగీకరించమని, ఆవిధంగా మరణించే సమయంలో అయినా తాను సన్యాసిగా ఉంటానని తల్లిని కోరుతాడు. దానికి ఆమె అంగీకరిస్తుంది. దీనిని అతురన్యాసం అని అంటారు. సన్యాసిగా మారే మంత్రాలు జపిస్తుండగానే ఆశ్చర్యకరంగా మొసలి శంకరులను వదిలివేస్తుంది. తల్లి అంగీకారంతో శంకరులు కాలడి విడిచి, గురువు కొరకు అన్వేషణలో నర్మదానది వద్దకు వెళ్ళారు. నర్మద ఒడ్డున గౌడపాదుల శిష్యుడైన గోవింద భగత్పాదులు ఉండే గుహ దర్శనం లభించింది. వ్యాసమహర్షి కుమారుడైన శుకుని శిష్యులు గౌడపాదులు. ఆయన నివసించే గుహను చూసిన వెంటనే శంకరులకు అడవుల నుంచి నడచి వచ్చిన అలసట అంతా తీరిపోయింది. గురువు ఆజ్ఞతో శంకరులు వారణాసికి చేరుకుని పవిత్ర గంగానదిలో పుణ్యస్నానమాచరించి. విశ్వేశ్వరుని సన్నిధిలోకొంతకాలం గడిపాడు. వారణాసిలోనే సదానందుడు అనే బ్రహ్మాచారి శంకరులకు ప్రధమశిష్యుడు అయ్యాడు. ఒకరోజు మద్యాహ్నం శంకరాచార్యులు గంగానదివైపు వెళ్తుండగా మార్గమద్యలో చండాలుడు అడ్డుపడుతాడు. ఆయన మాటల్లో పరమార్ధం విన్న శంకరుడు అంతరార్ధం గ్రహించి సాక్షాత్తు పరమశివుడే నాలుగు వేదాలతో వచ్చాడని గ్రహించి మహాదేవుడిని మనీషా పంచకం అనే ఐదు శ్లోకాలతో స్త్రోత్రం చేశారు. శంకరాచార్యుల శిష్యులోల పద్మపాదుడు, కుమారిల భట్టు, భట్టిపాదుడు తదితరులు ఉన్నారు. తన శిష్యులతోకలసి పలు పుణ్యక్షేత్రాలను సందర్శించాడు. ఈసందర్శనలో భాగంగా దక్షిణకైలాసంగా వెలసిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంను సందర్శించి ఇక్కడ శ్రీచక్రాన్ని ప్రతిష్టించారు. ఈ' శ్రీచక్రం' ఆలయంలోని అమ్మవారి పాదాల వద్ద ఉంటుంది.

సర్వజ్ఞపీఠం అధిరోహణః-

శంకరులు కాశ్మీర దేశంలో శారదాపీఠాన్ని సందర్శించారు. ఆపీఠానికి నలుదిక్కుల ద్వారాలలో నలుగురు ఉద్ధండ పండితులు ఉన్నారు. కాని దక్షిణ ద్వారం అంత వరకు తెరువబడలేదు. పండితులను మీమాంస వేదాంతాది తర్కాలలో ఓడించి శంకరులు దక్షిణ ద్వారాన్ని తెరపించి అక్కడి సర్వజ్ఞ పీఠాన్ని అధిరోహించారు. తన జీవితం చివరి దశలో శంకరులు కేదార్‌నాథ్, బద్రీనాథ్ క్షేత్రాలను సందర్శించి దేహ విముక్తుడయ్యాడరు. కేదారనాథ్ మందిరం వెనుక శంకరుల స్మృతికి చిహ్నాంగా ఒక సమాధి ఉంది. అయితే ఆయన కేరళలోని త్రిస్సూర్‌లో దేహం విడిచారని కేరళీయ శంకర విజయం చెబుతోంది. 32ఏళ్ళకే తనువు చాలించిన శంకరాచార్యుల జయంతిని శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైభంగా జరుపుకోడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# జగన్ ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు
## ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు




**నరసాపురం - ప్రభాతవార్త :** రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దత్తును ప్రకటిస్తూ 79 లక్షల మంది మిస్డ్‌కాల్స్ ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రతిపక్ష నాయకులు తప్ప ప్రజలంతా జగన్ ప్రభుత్వం వైపువున్నారని ఇందుకు కారణం ఆయన అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలని చెప్పారు. నరసాపురం నియోజకవర్గంలో 70 వేల కుటుంబాలుండగా 15 రోజుల్లో 50 వేల కుటుంబాలను స్వయంగా కలుసుకోవడం జరిగిందని ప్రజల నుండి 28 వేల మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ప్రభుత్వానికి పెద్ద ఎత్తున అండగావున్నారన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో చేపట్టిన పనుల్లో అత్యధికశాతం పనులు పూర్తయ్యాయని మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా సాగుతోందన్నారు. ఎంపిపి మైలాబత్తుల సోని జెడ్పీటిసి రాధాకృష్ణ, వైస్ చైర్మన్ నాగిని, మొగల్తూరు ఎంపిపి మైలాబత్తుల స్వామి, పార్టీ పట్టణ అధ్యక్షులు భూసారపు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# విదేశాలకు వెళ్లే వారి కోసం అవగాహన సదస్సులు - ఎపిఎస్ ఆర్టీసి సొసైటీ

**సచివాలయం. ఏప్రిల్ 24. ప్రబాతవార్త.** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ, ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీఎస్) ప్రపంచ వ్యాప్తంగా ఉంటున్న ప్రవాసాంధ్రుల సంక్షేమం, భద్రత, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో పని చేస్తూ, ప్రవాసాంధ్రులకు అనేక ఉచిత సేవలను ఏపీఎన్ఆర్టీ సొసైటీ అందిస్తుందని ఆ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెలిపారు. ఉపాధి, ఉద్యోగ నిమిత్తం విదేశాలకు వెళ్ళే కార్మికులకు ముందస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏపీఎన్ఆర్టీ సొసైటీ చేపడుతుందన్నారు. మన రాష్ట్రం నుండి చాలా మంది ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తునా ్నరని, అయితే అక్రమ ఏజెంట్ల మాటలు నమ్మి అవగాహన లేకుండా విదేశాలకు వెళ్లి ఇబ్బందులకు గురవుతున ్న వారి కోసం ఏపీఎన్ఆర్టీ అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 25వ తేదిన ఉదయం 10.30 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు నందు పద్మశ్రీ ఫంక్షన్ హాల్ (కూచిపట్ల, వల్లూరి వారి వీధి) వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పి, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమీషనర్‌తో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొంటారన్నారు. కావున ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, నియామక ఏజెంట్లు (రిక్రూటీంగ్ ఏజెంట్లు) వలస కార్మికులు, విదేశాలకు వెళ్లాలనుకుంటున్న వారు పాల్గొని, వారికి ఉన్న సందేశాలు , అపోహాలను నివృత్తి చేసుకోవాలని ఏపీఎన్ఆర్టీ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రకటనలో కోరారు.

# వైఎస్సార్సీకి వస్తున్న స్పందనకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రతిపక్షాలు
## - ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్




కాంగ్రెస్ పార్టీ మెగా పీపుల్స్ సర్వేకు క్షేత్రస్థాయిలో ప్రజల నుండి వస్తున్న విశేష స్పందనకు ప్రతిపక్షాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయని ప్రభుత్వవిప్, ఎంఎల్ఏ సామినేని ఉదయభాను అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ కార్యాలయం వద్ద సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌సిపి ఈనెల 7వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్తు పేరుతో మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించిందన్నారు. ఈకార్యక్రమంలో 7 లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల వద్దకు వెళ్ళి మీకు మేం చెప్పింది చేశాం, సంతృప్తిగా ఉన్నారా అంటూ మాకు మద్దతివ్వండి మా జగనన్నకు అండగా నిలవండి అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వేలోని తొలి 15 రోజుల్లో కోటి కుటుంబాలు పాల్గొనగా సిఎం జగనన్న పాలనకు మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ నమోదయ్యాయన్నారు. ఈవైఖరిని గమనించిన ప్రతిపక్షాలు ఉక్కిరిబిక్కిరి అవుతూ నిద్రలేని రాత్రులను గడుపుతున్నాయని హాస్యమాడారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా 90 శాతం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని పూర్తిచేయటం జరిగిందని, ప్రజల నుండిఅపూర్వ స్పందన లభిస ్తుందని అన్నారు. ఇచ్చిన హామీలను 98 శాతం పూర్తిచేసినందున 2024 ఎన్నికల్లో కూడా సిఎంగా జగన్మోహనరెడ్డిని దీవించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పలువురు వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# టిటిదేవస్థానమ్స్‌యాప్‌తో భక్తుల చేతిలోనే సమస్త సమాచారం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగవైకుంఠమ్ ఏడుకొండలపైకి చేరుకునే లక్షలాదిమంది భక్తుల కోసం "టిటిదేవస్థానమ్స" పేరుతో తిరుమలతిరుపతిదేవస్థానం కొత్త మొబైల్‌యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను ఆధునీకరించి మరిన్ని అప్లికేషన్లు పొందుపరిచారు. ఈ మొబైల్‌యాప్‌ద్వారా భక్తులు తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం, సేవలు, వసతి, అంగప్రదక్షిణ, సర్వదర్శనం,శ్రీవారి సేవ బుక్ చేసుకోవచ్చు. టిటిదేవస్థానమ్స్ పేరుతో రూపొందించిన కొత్త మొబైల్‌యాప్ సామాన్య భక్తులకు సులభంగా సేవలు అందుకునేందుకు రూపొందించారు. దేవదేవుడు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ విచ్చేసే భక్తుల కోసం మరింత ఆధునీకరించి టిటిదేవస్థానమ్స్ యాప్‌లో మరిన్ని అప్లికేషన్లు ఇందులో పొందుపరిచారు. ఈమొబైల్ యాప్‌ద్వారానే దర్శనం, వసతి సౌకర్యాలతో బాటు విరాళాలు కూడా అందించవచ్చు.పుష్ నోటిఫికేషన్ల ద్వారా తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే ఉత్సవాల వివరాలు ముందుగా తెలుసుకోవచ్చు.ఎస్వీబిసి ప్రసారాలను లైవ్‌స్ట్రీమింగ్ ద్వారా ఈ యాప్ ద్వారా వీక్షించే వెసలుబాటు ఉంది. జియో సంస్థ

TTDevasthanams
TTD Official

సహకారంతో టిటిడి ఐటి విభాగం ఈ యాప్‌ను రూపొందించింది. సామాన్యభక్తులకు స్వామివారి సేవలు, దర్శనం, టిక్కెట్లు ,వసతి సులువుగా అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా క్లౌడ్ టెక్నాలజీని ఉపయోగించుకోవచ్చు. ప్రతినెలా దర్శనం, సేవలు, శ్రీవాణి టిక్కెట్లతో బాటు తిరుమల,తిరుపతిలో వసతి కూడా ముందుగానే బుక్‌చేసుకోగలుగుతున్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు సంబంధించిన అన్ని అవసరాల కోసం డిజిటల్ గేట్‌వేగా ఈ యాప్ ఉపయోగపడుతుంది.

# నెల్లూరు నగర మేయర్‌కు తీవ్ర అవమానం
## ముగ్గురు కార్పొరేటర్లపై పోలీస్‌స్టేషన్లో మేయర్ ఫిర్యాదు

**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్24, ప్రభాతవార్త** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు కార్పొరేషన్ సర్వసభ సమావేశం సోమవారం రసాభాసగా జరిగింది. సభ జరిగిన తీరు గందరగోళాన్ని తలపించింది. కారొ ్పరేషన్ సమావేశ మందిరంలో మేయర్ పొట్లూరు స్రవంతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశంనిర్వహించారు. 54మంది కార్పొరేటర్లు వైసిపి పార్టీకి చెందిన వారే అయినప్పటికీ ఇటీవల రాజకీయ పరిణామాలతో నాలుగు వర్గాలుగా విడిపోయారు.దీంతో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. ముందుగా 9వ అంశంగా ఉన ్న కోట మిట్ట షాదీ మంజిల్ ప్రైవేటీకరణపై అభ్యంతరాలు



వ్యక్తమయ్యాయి.షాదీ మంజిల్‌ని పేదలకు అందుబాటులో ఉంచే విధంగా కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని పలువురు కార్పొరేటర్లు కోరారు.ఒక కమిటీ వేసేందుకు మేయర్ స్రవంతి అంగీకరించి ఆ అంశాన్ని వాయిదా వేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ ఫోటో విషయమై కార్పొరేటర్లు మేయర్ స్రవంతితో వాదనలకు దిగారు.మేయర్ స్రవంతి తాను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటం ఛాంబర్‌లో ఏర్పాటుకు వ్యతిరేకత చూపలేదని కార్పొరేటర్లకు సర్ధి చెప్పే ప్ర య ు త్ నం చేశారు.ఉద్రిక్త పరిస్థితుల మధ్య సభను కొంత సమయంవాయిదా వేసి తన ఛాంబర్‌కు వెళ్లే ప్రయత్నం చేశారు.మహిళా కార్పొరేటర్ మొయిళ్ల గౌరీ,కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి,బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ మేయర్‌ను నిలువరించే ప్రయత్నం చేశారు.మేయర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.మహిళా పోలీసులు రక్షణ మధ్య మేయర్ తన ఛాంబర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.తానుచెబుతున్నది వినకుండా గిరిజన మహిల మేయర్ అయిన తనపై కార్పొరేటర్లు ప్రవర్తించిన తీరు అవమానంగా భావించిన మేయర్ స్రవంతి కంటతడి పెట్టారు.కొంత విరామం అనంతరం సమావేశాన్ని కొనసాగించి ఈ బాధ్యతను నిర్వర్తించారు.సర్వసభ్య సమావేశంలో 95అంశాలకు గాను 93అంశాలకు కౌన్సిల ఆమోదం పొందింది.



# సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గౌతమి

**అనంతపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త బ్యూరో** జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సోమవారం సాయంత్రం నార్పల మండల కేంద్రంలో సిఎం జిల్లా పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి నార్పల బహిరంగ సభ ఖరారైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మండల కేంద్రాన్ని సందర్శించారు. హెలీ ప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు నడుచు కుంటూ వెళ్లి ప్రతి అంగుళం తనిఖీ చేశారు. హెలీ ప్యాడ్ నుంచి సభా వేదిక వరకు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం సీఎం కాన్వాయర్ ప్రయాణానికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, పర్యటన రోజు రాత్రి 50 మీటర్లకు ఒక పోలీసును నియమించాలన్నారు. సభకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రేపు సాయంత్రానికల్లా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని, ప్రజలంతా సహకరించి సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిఐజి ఆర్ఎన్.తిమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు,జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, ఆర్డిఓలు మధుసూధన్, నిశాంత్‌రెడ్డి, జె.రవీంద్ర, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, డిపిఓ ప్రభాకర్‌రావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు విడుదల
## మే, జూన్ నెల టిక్కెట్లు ఉదయం 10గంటలకు

**తిరుమల,ఏప్రిల్ 24ప్రభాతవార్తప్రతినిధి:** అఃలాండకోటిబ్రహ్మాండ నాయకుడు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని సాఫీగా, ఇష్టమొచ్చిన రోజు దర్శించుకునేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో విడుదల చేసే 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు మంగళవారం ఉదయం 10గంటలకు టిటిడి విడుదల చేస్తోంది. రానున్న మే,జూన్‌నెలలకు సంబంధించి ఈ దర్శన టిక్కెట్లు భక్తులు నేరుగా బుక్‌చేసుకునే సదుపాయం కల్పించారు. భక్తులు "తిరుపతిబాలాజీ.ఎపి.జీవోవి,ఇన్"వెబ్‌సైట్‌ద్వారా బుక్‌చేసుకోవాలి. టిటిడిదేవస్థానమ్స్ అధికారిక మొబైల్‌యాప్‌లోనూ టిక్కెట్లు బుక్‌చేసుకోవచ్చు.

# శ్రీనివాసంలోపలకు సబ్‌వే విస్తరణ పనులను పరిశీలించిన అధికారులు



**తిరుమల,ఏప్రిల్ 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన యాత్రికులు, భక్తులు ముందస్తుగా దర్శన టిక్కెట్లు కలిగిన వాళ్ళు తిరుపతిలోనూ బసచేస్తున్న టిటిడి శ్రీనివాసం వసతి సముదాయం వద్ద సులభంగా ప్రవేశానికి సబ్‌వే ఏర్పాటు దిశగా టిటిడి చర్యలు తీసుకుంటోంది. ఈ పనులపై సోమవారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగరపాలక మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, నగరపాలక ఉప మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి, ఎస్ఇ మోహన్ తదితరులు పరిశీలించారు. ఇక్కడ శ్రీనివాససేతు నిర్మాణంలో భాగంగా ఆర్టీసి బస్టాండు వైపునుంచి శ్రీనివాసం వద్దకు వచ్చే యాత్రికులుక సులభంగా సబ్‌వే నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఇప్పుడు భక్తులు శ్రీనివాసంలోకి చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణంవైపు గేటును నిర్మించి శ్రీనివాససేతుకు అనుసంధానం చేస్తే సులభంగా లోపలకు చేరుకునే అవకాశం ఉంటుంది.

# రాయల తెలంగాణ మళ్లీ తెరపైకి
## - సంచలన వ్యాఖ్యలు చేసిన జెసి దివాకర్‌రెడ్డి
## - వేసవి తర్వాత ఉద్యమానికి కార్యాచరణ అని ప్రకటన

**అనంతపురం, ఏప్రిల్ 24 ప్రభాతవార్త బ్యూరో** టీడీపీ సీనియర్‌నేత మాజీ మంత్రి జెసి దివాకర్‌రెడ్డి మరోసారి రాయల తెలంగాణ తీసుకొచ్చారు. రాయల తెలంగాణ రాష్ట్రం కోసం వేసవి తర్వాత ప్రత్యేక ఉద్యమ కార్యచరణ చేపడుతానని, ముఖ్యులను కలుపుతానని, కర్నూలులో జరిగిన సభలో జేసి దివాకర్‌రెడ్డి ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి రాష్ట్ర విభజన జరిగే సమయంలో అనంతపురం, కర్నూలు జిల్లాలను కలుపుకుని తెలంగాణలోని పది జిల్లాతో రాయల తెలంగాణ ఏర్పాటు చేయాలని ఆ విధంగా చేయడం వల్ల రాయలసీమ వెనుకబాటు తనం తగ్గిపోతుందని జెసి దివాకర్‌రెడ్డి అప్పట్లో ప్రకటన చేశారు. అనంతపురం, కర్నూలు జిల్లాల వాసులకు హైదరాబాద్ నగరంతో మంచి సత్సంబంధాలు ఉన్నాయని, ఈ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు నిత్యం తిరుగుతున్నారని, సరిహద్దులు కూడా సరిపోతాయని రాయల తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకమేనని, అప్పట్లో జెసి దివాకర్‌రెడ్డి దన వాదనను వినిపించారు. ముఖ్యులకు కూడా వినతిపత్రాలు ఇచ్చారు. అయితే రాష్ట్రం విడిపోయి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పడ్డాయి. రెండు రాష్ట్రాలు ఎవరి దారిలో వారు పరిపాలన కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మళ్లీ రాయల తెలంగాణ ప్రస్తావన రావడం చర్చనీయాంశమైంది. రాయలసీమ కర్తవ్య దీక్ష పేరుతో బిజెపి నేత మాజీ మంత్రి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలులోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో సోమవారం సభ జరిగింది. రాయలసీమ బాగుకోసం ప్రస్తుతం ఏమి చేయాలన్న ఆలోచనతో ఆ కార్యక్రమాన్ని నిర్వ హించారు. రాయలసీమ కర్తవ్య దీక్షకు మాజీ మంత్రి జెసి దివాకర్‌రెడ్డితో పాటు మాజీ ఎంపి గంగుల ప్రతాప్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు డా.శైలజానాథ్, సిపిఎం నేత, మాజీ ఎమ్మెల్యే గఫూర్ తదితరులు రాజకీయాలకు అతీతంగా హాజరయ్యారు. ఈ దీక్షలో మాజీ ఎంపి జెసి దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయల తెలంగాణ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. రాయల తెలంగాణ కోసం రాబోయే వేసవి కాలం ముగిసిన తర్వాత అనంతపురం, కర్నూలు జిల్లాలోని ముఖ్య నేతలతోపాటు తెలంగాణ జిల్లాల నేతలతో కూడా కలుస్తానని జెసి దివాకర్‌రెడ్డి చెబుతున్నారు. రాయల తెలంగాణకు ఉద్యమ కార్యచరణకు పూనుకుంటానని చెబుతున్నారు. గోదావరి నదిపై కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణ సీఎం కెసిఆర్ ముందు చూపుతోనే నిర్మించారని, సీఎం కెసిఆర్ పెద్దమనసు చేసుకుని కాళేశ్వరం నీటిని రాయలసీమకు కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా రాయలతెలంగాణ నినాదాన్ని మాజీ ఎంపి జేసి దివాకర్‌రెడ్డి మళ్లీ తెరపైకి తీసుకురావడం చర్చనీయాంశంగా మారింది. అయితే రాయలతెలంగాణ ఇప్పుడు మళ్లీ ఏర్పాటు చేయడం అంత సులభం కాదని, రాయల తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చేందుకు అవకాశం లేదని, రాయలసీమలోని టీడీపీ, వైసీపీ ప్రతినిధులు కూడా తమ స్టాండ్‌ను తెలియజేస్తూ గట్టిగా మాట్లాడే అవకాశం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో 30 ఏళ్లపాటు వరుసగా తాడిపత్రి ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలువురు సీఎంల దగ్గర కీలక మంత్రిగా పని చేసిన జెసి దివాకర్‌రెడ్డికి అపారమైన అనుభవం, ఉంది. అయితే వయస్సు పైబడినందున ఇప్పుడున్న పరిస్థితుల్లో రాయల తెలంగాణ నినాదం ముందుకు తీసుకెళ్లేందుకు సభలు, సమావేశాలు పెట్టి అందరినీ కలిసే ప్రయత్నం చేస్తాడా లేదా అన్నది ప్రశ్నార్థకమే.



